నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 16 డిసెంబర్ 2024 RANGAREDDY




మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న ఎతుబార్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మహిళా కార్యకర్తలు

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

**పార్టీని మరింత బలోపేతం చేయాలి**
**మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి**
**బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన మహిళా కార్యకర్తలు**

మొయినాబాద్, డిసెంబర్ 15 : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎతుబార్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మహ మూదా, నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్నాఅంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన మహిళా కార్యకర్తలు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలిచ్చి.. పవర్‌లోకి రాగానే వాటిని అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చలేక తుంగలో తొక్కారని ఆరోపించారు. మహిళలకు ప్రతి నెలా రూ. 2500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు చిల్లి గవ్వా ఇవ్వలేదని.. యువతులు, మహిళలకు స్కూటీలు ఇస్తామని చెప్పి మరిచిపోయారని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై ఉన్న నమ్మకం పోయి మహిళలు, ఆపార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, నయీం, ఖలీల్, విఠల్, సునీత తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన వికారాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు

## గ్యారెంటీల పేరుతో గారడీ

**అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్**
**బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**
**బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల చేరిక**

వికారాబాద్/ధారూరు, డిసెంబర్ 15 : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. ఆదివారం ఆయన నివాసంలో వికారాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మల్లేశం, ఖలీల్, పాషా, ప్రవీణ్, మల్లేశం, మహేశ్‌కుమార్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, ఫయాజ్, మహిపాల్‌రెడ్డి, అశోక్, మల్లేశ్, కావలి వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించడంతోపాటు బోటింగ్ చేస్తూ సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడిపారు.
–ధారూరు, డిసెంబర్ 15




ఆన్‌లైన్ జూదం.. యువత జీవితాలను ఛిద్రం చేస్తున్నది.. జూదంలో కూరుకుపోయి.. యువత బలవన్మరణానికి పాల్పడుతున్నది. మరోవైపు రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు జోరుగా సాగుతున్నాయి. దీనికి సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ కూడా కొందరు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఈ వ్యసనానికి బానిసగా మారిన చాలా మంది యువత తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల ఖాతాలకు పంపిస్తున్నారు. అక్రమ పద్ధతిలో నడుస్తున్న ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లలో నిర్వాహకులు ఏఐ సహకారాన్ని తీసుకుంటూ కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేస్తున్నారు. అమాయకులకు వల వేసి భారీగా సంపాదిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు ఈ గేమ్స్‌ను ప్రమోట్ చేయడానికి భారీగానే వెచ్చిస్తున్నారు. రమ్మీ వంటి ఆన్‌లైన్ గేమ్‌లకు పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారు ఆ షాక్ నుంచి కోలుకోక, బయట ముఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడ్డ ఘటనలు రాష్ట్రం వ్యాప్తంగా తరచూ చోటు చేసుకుంటున్నాయి.
- సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ)

# జీవితాలు ఛిద్రం

**జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్స్**
**అమాయకులకు వలవేసి.. కోట్ల వ్యాపారం**
**రాష్ట్రంలో నిషేధమున్నా.. చెలరేగిపోతున్న నిర్వాహకులు**
**మార్కెటింగ్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్**
**గ్యాంబ్లింగ్‌లో కూరుకుపోయి.. యువత బలవన్మరణం**

### జిమ్మిక్కులు చేస్తూ...

ఆన్‌లైన్ రమ్మీ, ఇతర గ్యాంబ్లింగ్ ఆటల్లోకి కస్టమర్లను ఆకర్షించేందుకు వివిధ వెబ్‌సైట్లు ఇంటర్‌నెట్‌లో భారీ ప్రకటనలిస్తుంటాయి. దానికి తోడు మా వెబ్‌సైట్లో సభ్యత్వం తీసుకుంటే బంపర్ ఆఫరిస్తామంటూ బుట్టలో పడేస్తున్నారు. ఆట ప్రారంభంలో డబ్బులు ఇచ్చినట్లే చేసి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటపై వినియోగదారులకు మోజు పెంచుతున్నారు. ఇది వ్యసనంగా మారడంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆటల నుంచి బయటకు రాని పరిస్థితిలో చాలామంది ఉంటున్నారు. ఏ సభ్యుడు రోజు ఎంత సేపు ఆడుతున్నాడనే విషయాన్ని గుర్తిస్తూ, ఆన్‌లైన్ సైట్ నిర్వాహకులు వారి దృష్టంతా ఆటపై ఉండేందుకు జిమ్మిక్కులు చేస్తుంటారు. మొదట రమ్మీ, ఇతర బెట్టింగ్ ఆటలు ఆడిన వారికి గెలిచేందుకు కొంత అవకాశమిస్తారు.. ఆ తరువాత వారికి ఆటను అలవాటు చేసి ఇక ఆశలో వారిని ముంచేస్తుంటారు. పది సార్లు పెట్టుబడి బడితే అందులో 8 సార్లు నష్టపోవడం, రెండు సార్లు లాభం వచ్చినట్లు చూపించే లాజిక్స్‌ను బ్యాకెండ్ నుంచి గ్యాంబ్లింగ్ ఆట నిర్వాహకులు చేస్తుంటారు. ఇలాంటి గ్యాంబ్లింగ్ ఆటపై గతంలో హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కలర్ ప్రిడిక్షన్ గేమ్‌ను గతంలో ఉక్కుపాదంతో అణచివేశారు. ఈ గేమ్‌లో నష్టపోయిన వారు ఆత్మహత్యలు చేసుకుంటుండడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా పోలీసులు స్పందించి మూలాల వరకు వెళ్లి ఆన్‌లైన్‌లో జరిగిన స్కామ్‌ను వెలుగులోకి తెచ్చి దేశ వ్యాప్తంగా నిర్వాహకులను పట్టుకున్నారు.

### మార్కెటింగ్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్స్..

పలు వ్యాపార సంస్థలు తమ వ్యాపారాభివృద్ధికి ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రకటనలు ఇప్పిస్తున్నాయి. సాధారణంగా వ్యాపార ప్రకటనలు ఇస్తే తక్కువ మొత్తంలోనే ఆదాయం ఉంటుంది. అదే నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను మార్కెటింగ్ చేస్తే భారీగా ఆదాయం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన లింక్‌లు తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా తమ ఫాలోవర్స్‌కు చేరే విధంగా మార్కెటింగ్ చేస్తున్నారు. కొందరికీ లక్షల్లో వ్యూవర్స్ ఉంటున్నారు. అందులో కనీసం 10 శాతం మంది అయినా ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో బెట్టింగ్ యాప్‌లకు భారీగానే ఆదాయం వస్తున్నది. అందులో కొందరు కమీషన్లు తీసుకుంటూ.. మరింతగా ప్రమోట్ చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్ ఇతర రాష్ట్రాలు, దేశాల వేదికగానే కొనసాగుతున్నాయి. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్స్ ఇస్తూ కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

### సైబర్ నేరాలకు తోడు..

పెట్టుబడి, డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ జాబ్స్ ఇలా పలు రకాలైన సైబర్ నేరాలు చేస్తున్న ప్రధాన సైబర్ నేరగాళ్లు.. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహణలోనూ సూత్రధారులుగా ఉంటున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఈ దిశగా విచారణ జరిపితే గ్యాంబ్లింగ్ గేమ్స్‌ను నిరోధించేందుకు అవకాశముంటున్నది.




# పత్తి పైసలు రాలే..

**తెల్ల బంగారాన్ని విక్రయించిన రైతులకు నెలరోజులైనా అందని డబ్బులు**
**సీసీఐ కేంద్రాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు**
**వికారాబాద్ జిల్లాలో 62,403 మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ**
**దాని విలువ రూ.464 కోట్లు**
**ఇంకా పెండింగ్‌లో రూ.293 కోట్ల చెల్లింపులు**

జిల్లాలో పత్తి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పత్తి విక్రయించే సమయంలో ఏదో ఒక కొర్రీ పెట్టి రైతులను ఇబ్బంది పెట్టిన సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) డబ్బుల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఐదారు రోజుల్లోనే అన్నదాతలకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీసీఐ అధికారులు ప్రకటించినా.. నెల రోజులు దాటినా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడం, ఆధార్ మ్యాపింగ్ లేకపోవడం తదితర కారణాలతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జిల్లాలో ఇప్పటివరకు (రూ. 464 కోట్ల విలువ) 62,403 మెట్రిక్ టన్నుల పత్తిని రైతుల నుంచి సేకరించి రూ.171 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో సీసీఐ జమ చేసింది. మరో రూ.293 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా జిల్లాలో ఈ ఏడాది 2,40,000 ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా.. 2,00,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.
- వికారాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ)



### అంచనాలకు మించని సేకరణ..



అన్నదాతల నుంచి పత్తిని సేకరించేందుకు జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. తాండూరులో మారుతి, శుభం, బాలాజీ, కోట్‌పల్లిలో సాయిబాబా కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్, పరిగిలో లక్ష్మీవేంకటేశ్వర, నరసింహ, రాకంచర్ల కాటన్‌మిల్లు, వికారాబాద్‌లో ధరణి, సాయిబాబా, అయ్యప్ప జిన్నింగ్ మిల్లు, మర్పల్లిలో శ్రీ అయ్యప్ప కాటన్ ట్రేడర్స్, కొడంగల్‌లో విజయ్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 2,00,000 మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు 62,403 మెట్రిక్ టన్నుల పత్తిని 25,328 మంది రైతుల నుంచి సేకరించారు. అయితే పత్తిని విక్రయించిన రైతులు డబ్బుల కోసం సీసీఐ కేంద్రాల చుట్టూ పడిగాపులు గాస్తున్నారు. నెలరోజులు దాటుతున్నా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో.. మిగిలిన రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాల్లో కాకుండా మధ్యదళారులు, వ్యాపారులకు రూ. 100 తక్కువైనా విక్రయిస్తుండడం గమనార్హం. కాగా జిల్లాలో ఏర్పాటైన 14 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే ఎనిమిది సెంటర్లను అధికారులు మూసేశారు. వికారాబాద్‌లోని ధరణి, సాయిబాబా అగ్రోటెక్, అయ్యప్ప కాటన్‌మిల్లు, పరిగిలోని రాకంచర్ల కాటన్ మిల్, శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఇండస్ట్రీస్, మర్పల్లిలోని అయ్యప్ప కాటన్ ఇండస్ట్రీస్, ధారూరులోని సాయిబాబా ఆగ్రో కామడిటిస్, కోట్‌పల్లిలోని మంగళం కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు ప్రక్రియ రెండు రోజుల కిందటి నుంచే నిలిచిపోయింది.

### త్వరగా చెల్లింపులు జరిగేలా చర్యలు..

పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా చెల్లింపులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సీసీఐ నుంచి డబ్బులు రావాల్సి ఉండడంతోపాటు రైతుల ఆధార్ కార్డులు లింక్ కాకపోవడం వంటి కారణాలతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది.
– సారంగపాణి, వికారాబాద్ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి



పరిగిలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# సజావుగా గ్రూప్-2

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా పరీక్షలు**
**ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ**
**రంగారెడ్డి జిల్లాలో 42% హాజరు నమోదు**
**వికారాబాద్ జిల్లాలో 53%**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం సజావుగా సాగా యి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి పేపర్.. మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు రెండో పేపర్ జరిగిం ది. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. సెంటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లను అధికారులు మూయించారు. రంగారెడ్డి జిల్లాలో 90 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 56,883 మందికి సుమారు 27,000 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలు రాశా రు. హాజరు శాతం 42గా నమోదైంది. ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మంది అభ్యర్థులను అధికారులు అనుమతించకపోవడంతో నిరాశగా తిరిగి వెళ్లారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం అభ్యర్థులు 10,381 మంది కాగా హాజరు శాతం 53గా నమోదైంది. పరిగిలోని విజ్ఞాన్ జూనియర్, పల్లవి డిగ్రీ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించి పరిశీలించారు.



ఇబ్రహీంపట్నం గురునానక్ పరీక్షా కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మంది అభ్యర్థులు.. అనుమతించని అధికారులు